


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

కొత్త రేషన్‌కార్డులు వచ్చేశాయ్‌!



ఉమ్మడి జిల్లాకు 52,747 మంజూరు

ఎన్నోఏళ్ల నిరీక్షణకు తెరపడింది. ఎట్టకేలకు కొత్త రేషన్ కార్డులు వచ్చేశాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 52,747 కార్డులను ప్రభుత్వం మంజూరు చేసింది. కొత్తగా కార్డులు వచ్చినవారికి ఈ నెల నుంచే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. కొత్త రేషన్ కార్డుల మంజూరుపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే కార్డులు రానివారి నుంచి దరఖాస్తులు తీసుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. విడతలవారీగా కొత్త కార్డులు మంజూరు చేస్తామని సర్కార్ ఇప్పటికే ప్రకటించింది.



ఈ నెల నుంచే కొత్త కార్డుదారులకు బియ్యం



జిల్లాలో కొత్తగా 6,700 మందికి ఈనెల నుంచి రేషన్ బియ్యం అందనుంది. కొత్త కార్డుదారుల డీకేఆర్ పూర్తయి నందున, వారు ప్రింటవుట్ తీసుకుంటే సరిపోతుంది. కొత్తకార్డుల పంపిణీ కార్యక్రమాలపై ఎటువంటి ఆదేశాలు రాలేవు.


-సుగుణాబాయి,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మేడ్చల్

హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.. హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

నేటి నుంచి బియ్యం పంపిణీకి చర్యలు.. కొనసాగుతున్న దరఖాస్తుల ప్రక్రియ

వికారాబాద్/మేడ్చల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఏళ్లుగా రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు శుభవార్త చెప్పింది. లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వం తొలి విడతగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు 52,747 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసింది. అందులో రంగారెడ్డి జిల్లాకు 23,643 రేషన్ కార్డులు మంజూరు కాగా, వికారాబాద్ జిల్లాకు 22,404, మేడ్చల్ జిల్లాకు 6,700 కార్డులు మంజూరయ్యాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించింది. కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియలో భాగంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో శనివారం రేషన్ కార్డులు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన

మిగతా 7వ పేజీలో...



ఆగని దరఖాస్తుల ప్రక్రియ

రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో కార్డులు లేని నిరుపేదలు ఇంకా దరఖాస్తులు చేసుకుంటూనే ఉన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రజల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తుంది. మేడ్చల్ జిల్లాలో దరఖాస్తులు లక్షల్లో ఉండగా, ప్రభుత్వం కేవలం 6,700 కొత్త రేషన్ కార్డులు మాత్రమే మంజూరు చేయడం గమనార్హం.

ఏం లచ్చన్నా.. పనులు ఎంతవరకు వచ్చాయి?

ఫ్యూచర్ సిటీ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా!

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు భూసేకరణలో సహకారంపై కేఎల్లాఆర్‌కి కితాబు

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశం



కేఎల్లార్‌తో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఫ్యూచర్ సిటీ భూసేకరణ పనులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన మీనాక్షి నటరాజన్‌ను శుక్రవారం ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు దిల్‌కుష్ గెస్ట్‌హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి పలకరించారు. వీరిద్దరూ జిల్లా రాజకీయాలు, ఇతర అంశాలపై కాసేపు ముచ్చటించుకున్నారు.

గెలుపు గుర్రాలకే అవకాశం

ఈ సందర్భంగా ఫ్యూచర్ సిటీకి వెళ్లే 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డు భూసేకరణ పనులపై సీఎం ఆరా తీశారు. ఏం లచ్చన్నా.. భూసేకరణ పనులు ఎంత వరకు వచ్చాయని అడిగారు. త్వరగా ఈ పనులు పూర్తయ్యేందుకు అధికారులకు సహకరించాలని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు ఏర్పాటుతో ఆ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుందని సీఎం వివరించారు. మీరంతా కూడా భూసేకరణ విషయంలో సహకరిస్తుండడం అభినందనీయమన్నారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నందుకు ఈ సందర్భంగా కేఎల్లాఆర్‌ను అభినందించారు. వచ్చే స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని ఆదేశించారు. విజయం సాధించే గెలుపు గుర్రాలను ఎంపిక చేయాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ ఆదాయంలో వికారాబాద్ టాప్



గతేడాది కంటే పెరిగిన ఇన్‌కమ్

జిల్లాలో ప్రక్రియ వేగవంతం చేసేందుకే ప్రీ రిజిస్ట్రేషన్ సదుపాయం

జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ కుమార్

వివరాలు 8లో..

పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు

» జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్స్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 29 సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలను బోర్డు నిబంధనల ప్రకారం జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో అన్ని వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులు పరీక్ష రాసేందుకు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు కె. రూపాలక్ష్మీ, సత్తయ్య, డిస్ట్రిక్ట్ బల్క్ ఇన్‌చార్జి బుచ్చిరెడ్డి, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, కుమార స్వామి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్ నర్సింహారెడ్డి, కుమార స్వామి, సురేశ్వర స్వామి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో ఏఐ బోధన

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం డీఈవో రేణుకాదేవి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఏఐ బోధనను పరిశీలించారు. ఈ విధానంతో విద్యార్థులకు సులభంగా అర్థం అవుతుందన్నారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తుండటంతో విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్‌వో రమేశ్, ఎంఈవో వెంకట్, ప్రధానోపాధ్యాయులు షఫీ, సీఆర్‌పీ వెంకటేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాయాజలం!

తాగునీటి పేరిట దోపిడీ

మేడ్చల్‌లో పుట్టగొడుగుల్లా నీటిశుద్ధి కేంద్రాలు

నాణ్యత లేకుండానే అమ్మకాలు

నిబంధనలు పాటించని నిర్వాహకులు

అనారోగ్యం పాలవుతున్న ప్రజలు

పట్టించుకోని అధికారులు



నీటి శుద్ధి కేంద్రంలో ఫిల్టర్లు



మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నీటి దందా కాసుల వర్షం కురిపిస్తోంది. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు అంటూ.. చాలా మంది నీటి శుద్ధి కేంద్రాలు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. మేడ్చల్ ప్రాంతంలో అక్రమంగా నీటిశుద్ధి కేంద్రాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్వహిస్తుండటంతో ఆ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..

రూ.లక్ష ఉంటే నెలకు రూ.50వేలు సంపాదించవచ్చని కొందరు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం, జాగ్రత్తల గురించి కనీస అవగాహన లేకుండా ప్లాంట్లు నడుపుతున్నారు. వేసవి దృష్ట్యా అధికారులు నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. గోదావరి నీరు ఇంటింటికీ సరఫరా అవుతున్నా ప్రజలు మాత్రం ఆ నీటినే కొని తాగుతున్నారు. దీంతో డిమాండ్‌కు అనుగుణంగా నిబంధనలకు విరుద్ధంగా నీళ్లను

మిగతా 8వ పేజీలో...

రంజాన్ మాసంలో సౌకర్యాలు కల్పించండి

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సుధీర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ సమయాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. మసీదులు, ఈద్గాల వద్ద పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పంచాయతీ, మున్సిపల్ అధికారులకు సూచించారు. శాంతి భద్రతలను నిశితంగా పరిశీలించాలని పోలీసులు అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో వాసుచంద్ర, ఇన్‌చార్జి డీఎండబ్ల్యూవో హన్మంత్‌రావు, అడిషనల్ ఎస్పీ హన్మంత్ రావు, డీపీవో జయసుధ, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా, మిషన్ భగీరథ, ట్రాన్స్‌కో, మెడికల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



కుస్తీపోటీల్లో పల్లె పహిల్వాన్లు

కుస్తీమే సవాల్

జీవన్గి జాతరలో హోరాహోరీగా పోటీలు

బషీరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జీవన్గి గ్రామంలోని శ్రీ మహాదేవ లింగేశ్వరాలయం జాతర శుక్రవారంతో ముగిసింది. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆలయ సమీపంలో కగ్నానది ఇసుక దిబ్బలపై ఉత్కంఠగా కుస్తీ పోటీలు నిర్వహించారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన సుమారు 95 మందికి పైగా మల్లయోధులు హోరాహోరీగా తలపడ్డారు. ఈ పోటీలను తిలకించేందుకు ఆయా రాష్ట్రాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఈ పోటీలు జరిగాయి. కొబ్బరికాయ కుస్తీని మొదలుకొని రూ.50 నుంచి 5 వేల వరకు నగదు, 5, 10 తులాల వెండి కడియం కుస్తీపోటీ వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో కర్ణాటకకు చెందిన సిద్ధు విజేతగా నిలిచారు. రెండో స్థానంలో కర్ణాటక సంతోశ్ నిలిచాడు. ఆలయ కమిటీ తరఫున ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, నవాంద్గీ సొసైటీ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్ విజేతలకు 10 తులాల వెండి కడియాలను దరిపంజేశారు. ఈ పోటీల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ నగేశ్ నేతృత్వంలో ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



పుష్పయాగం నిర్వహిస్తున్న నిర్వాహకులు



స్వామివారికి అన్నాభిషేకం

ఘనంగా అన్నాభిషేకం

» నేటితో బ్రహ్మోత్సవాల ముగింపు

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : కీసరగుట్ట బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శుక్రవారం రామలింగేశ్వర స్వామికి ఘనంగా అన్నాభిషేకం నిర్వహించారు. అభిషేకించిన వరి అన్నాన్ని ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. ఉత్సవాలల్లో భాగంగా రాత్రి స్వామివారి ఉత్సవ మూర్తులకు వివిధ రకాల పూలతో వసంతోత్సవం, పుష్పయాగం నిర్వహించారు. కాగా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత శుక్రవారం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మహామండపంలో అర్చకులు ఆశీర్వచనలు అందజేశారు. అనంతరం ఆమె ఆర్యవైశ్య నిత్యాన్నదానం సత్రాన్ని పరిశీలించి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కాగా, నేటి(శనివారం)తో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. నిర్వాహకులు పూర్ణాహుతితో కార్యక్రమాలను ముగించనున్నారు.

యువజన క్రీడలు ప్రారంభం

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం యువజన క్రీడలు ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం ప్రకారం చుట్టుపక్కల గ్రామాల్లోని యువకులకు క్రీడా పోటీలు నిర్వహిస్తారు. అందుల్లో భాగంగానే శుక్రవారం యువకులకు ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆలయ చైర్మన్ నారాయణశర్మ ప్రారంభించారు.

19,888 మందికి ఆర్థిక సాయం

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఖాతాలకు రూ.11.93 కోట్లు బదిలీ



వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అర్హులైన వ్యవసాయ కూలీల ఖాతాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిధులు బదిలీ అయ్యాయి. జిల్లాలో ఉపాధి హామీ పథకంలో నమోదైన వ్యవసాయ కూలీల్లో 19,888 మందిని అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. ఎంపిక చేసిన వారికి రూ.6 వేల చొప్పున జిల్లాకు రూ.11,93,28,000 నిధులు విడుదల చేసింది. ఈ పథకం కింద మొదటి విడతగా గత జనవరి, 26న ఒక్కో మండలం నుంచి ఒక్కో గ్రామం వంతున జిల్లాలోని 20 మండలాల నుంచి 20 గ్రామాల నుంచి 719 మంది లబ్ధిదారులకు రూ.6 వేల చొప్పున నిధులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు లేని జిల్లాల్లో ఆత్మీయ భరోసా పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఆర్థిక సాయం జమచేయాలని ఆదేశించిన విషయం తెలిసిందే. భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రెండు విడతలుగా రూ.12 వేల ఆర్థిక సాయం అందజేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్న కుటుంబాల్లో గత ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పథకం పనులు చేసిన కుటుంబాలనే ఆత్మీయ భరోసాకు ఎంపిక చేశారు.

మండలాల వారీగా ఇలా..

జిల్లాలో అత్యధికంగా పెద్దేముల్ మండలంలో 2,111 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపికయ్యారు. బంట్వారం మండలంలో 1,187 మంది, బషీరాబాద్‌లో 1,106, బొంరాస్‌పేట్‌లో 599, ధారూరులో 1,342, దోమలో 845, దౌల్తాబాద్‌లో 387 మందిని ఎంపికయ్యారు. కొడంగల్‌లో 722 మంది, కోట్‌పల్లిలో 1,198, కులకచర్లలో 1,625, మర్పల్లిలో 1,636, మోమిన్‌పేట్‌లో 1,236 మంది ఎంపికయ్యారు. నవాబ్‌పేట్‌లో 656 మంది, పరిగిలో 976, పూడూరులో 845, తాండూరులో 1,211, వికారాబాద్‌లో 1,120, యాలాల్‌లో 1,104 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం నిధులను బదిలీ చేశారు.



3 క్వింటాళ్ల చికెన్.

2వేల గుడ్లు

ఉచిత మేళాకు అనూహ్య స్పందన

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చికెన్‌తింటే బర్డ్‌ఫ్లూ సోకుతుందనేది కేవలం అపోహ అని ప్రీమియం చికెన్ సంస్థ రాష్ట్ర ఏజీఎం జ్ఞానశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ రోడ్డులో రాంరెడ్డి చికెన్‌సెంటర్ వద్ద భారీ చికెన్ మేళాను నిర్వహించారు. గంట సమయంలో మూడు క్వింటాళ్ల చికెన్ వేపుడు, 2వేల ఉడుక బెట్టిన గుడ్లు ఖాళీ అయ్యాయి. నిర్వాహకులు మాట్లాడుతూ అపోహలతో పౌల్ట్రీ రంగం భారీగా నష్టపోయిందన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రతినిధి స్వామి, రాంరెడ్డి చికెన్ సంస్థ యాజమాన్యం చైతన్య కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

యాచారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని యాచారం ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. 330 మంది విద్యార్థులకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావును ఆదేశించారు.

ఘనంగా కల్యాణోత్సవం


ఆలయానికి బోనాలతో వస్తున్న మహిళలు


ఆలయం వద్ద ఎంపీ ఈటల రాజేందర్


మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు నెత్తిన బోనంతో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతోపాటు బీజేపీ నాయకులు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, అమరం మోహన్‌రెడ్డి, సరస్వతి పాల్గొన్నారు.


















మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ మొగులయ్య

కులకచర్ల సొసైటీని
ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కులకచర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల సొసైటీని ఉమ్మడి జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ కనకం మొగులయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సొసైటీ పరిధిలో 17,988 మంది సభ్యులుండగా, ఇందులో 5,956 మంది సభ్యత్వం పొంది ఉన్నారని, 12,032 మంది తాత్కాలిక సభ్యులుగా ఉన్నారని వివరించారు. బంగారంపై రుణాలు 1,480 మందికి రూ.12.45 కోట్లు, స్వల్పకాలిక రుణాలు 1,444 మంది రైతులకు రూ.12.65 కోట్లు, దీర్ఘకాలిక రుణాలు 958 మంది రైతులకు రూ.27.36 కోట్లు, స్వయం ఉపాధి కింద 80 మందికి రూ.14.60 లక్షలు అందించామని చెప్పారు. గతేడాది నికర లాభం రూ.1.84 కోట్లు వచ్చిందని, కొత్తగా రైతులకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ నాగరాజు, సీఈవో బక్కారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మేనేజర్ అంజనేయులు, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి తాత్కాలిక పీఎస్ ప్రారంభం


సీఐ శ్రీనివాస్‌గౌడ్‌తో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా భవనం నిర్మిస్తున్నందున పోలీస్‌స్టేషన్‌ను అంబేడ్కర్ భవన్‌లోకి మార్చినట్లు రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. నార్సింగి ఏసీపీ రమణగౌడ్‌తో కలిసి అంబేడ్కర్ భవన్‌లో తాత్కాలిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించారు. పోలీస్‌స్టేషన్ తాత్కాలిక భవనం కోసం అనువైన వాటిని వెతికామని, అంబేడ్కర్ భవన్ సౌకర్యవంతంగా ఉందని తెలిపారు. పోలీస్‌స్టేషన్ కోసం అంబేడ్కర్ భవన్‌ను ఇచ్చిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌ను అభినందించారు. 35 ఏళ్ల క్రితం నిర్మించిన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పూర్తిగా పాడైనందున, అత్యాధునిక హంగులతో కొత్తది నిర్మిస్తున్నట్లు చెప్పారు. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు కార్యకలాపాలు అంబేడ్కర్ భవన్‌లోనే కొనసాగుతాయని తెలిపారు. సీఐలు వీరబాబు, సమరం రెడ్డి, ఎస్సైలు సుందరయ్య, బేతప్ప, సిబ్బంది ఉన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

టీయూడబ్ల్యూజే-ఐజేయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టీయూడబ్ల్యూజే-ఐజేయూను బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశం తొర్రూర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 3 వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టిన తర్వాత జిల్లా మహాసభలు నిర్వహిస్తామని తెలిపారు. మహాసభల సందర్భంగా జిల్లాలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న జర్నలిస్టులను ఘనంగా సన్మానిస్తామని పేర్కొన్నారు. ఆయా నియోజకవర్గాలకు జిల్లా కమిటీ బాధ్యులు, ఆయా ప్రెస్ క్లబ్‌ల అధ్యక్షులు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారని చెప్పారు. సమావేశంలో యునియాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, మఫిసిల్ జర్నలిస్టు ఫోరమ్ రాష్ట్ర కన్వీనర్ గుడిపల్లి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీమ్ పాషా, సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కటకం సుభాష్, ప్రసాద్, సంయుక్త కార్యదర్శులు జగన్ గౌడ్, రాజేష్, కోశాధికారి సంరెడ్డి శశిపాల్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాండు, వెగ్గలం శ్యామ్, బద్దుల మల్లేష్ యాదవ్, దర్శనం జంగయ్య, రచ్చ శేఖర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీసేవలో విజిలెన్స్ తనిఖీ


ఆపరేటర్‌తో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో భాగంగా విజిలెన్స్ అధికారులు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మీ సేవ కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఉన్న మీ సేవ సెంటర్‌కు ఒక్కసారిగా వచ్చిన అధికారులు లోపలికి ఎవరినీ అనుమతించకుండా విచారణ చేపట్టారు. ఆపరేటర్‌తో మాట్లాడి పలు వివరాలను తెలుసుకున్నారు. మీ సేవకు సంబంధించిన అనుమతి పత్రాలు, ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మీ సేవలలో అధిక డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. అయితే వచ్చిన అధికారులు మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలికపై తన ఇంట్లో లైంగికదాడికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు వ్యక్తిని పట్టుకొని చితకబాది తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న ఎస్సై అరవింద్‌కుమార్ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పూర్తి విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అడవుల మైసమ్మకు ఘనంగా బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చల్లంగా చూడమ్మ మైసమ్మ తల్లీ అంటూ మహిళలు అమ్మవారికి బోనాలతో నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం మండల పరిధిలోని మైసమ్మతండా సమీపంలో వెలసిన అడవుల మైసమ్మతల్లికి చిట్లపల్లి, ఖాజాఅహ్మద్‌పల్లి, పోచమ్మ తండా, మైసమ్మతండాకు చెందిన మహిళలు బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి కోడి పుంజులు, మేక పోతులను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సుఖ సంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించుకుందాం

పరిగి: పరిగిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు సంబంధించి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు గతంలో ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో జరిగేవన్నారు. గతేడాది నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతుండడం శుభపరిణామమన్నారు. మార్చి 9, 10, 11 తేదీల్లో మూడు రోజులపాటు ఉత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

నవాబుపేట: మండలంలోని నారేగూడ గ్రామంలో శుక్రవారం శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి డాక్టర్ పర్వేద మాణిక్‌రావు, లత దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ రాష్ట్ర జాయింట్ కార్యనిర్వాహణ అధికారి అమృత్‌రావు, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు, బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రకాంత్ పాల్గొన్నారు.

అట్టహాసంగా మల్లన్న జాతర



ఉత్సవాల్లో నిప్పులపై నడుస్తున్న భక్తులు

కులకచర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పయిపల్లి గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులుగా మల్లన్న జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండం మహోత్సవం నిర్వహించారు. భక్తులు నిప్పులపై నడిచారు. స్వామివారికి అభిషేకం, కల్యాణ మహోత్సవం, అఖండ భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

అప్పులపాలవుతున్నా పట్టించుకోరా?

» మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రజాపాలనలో పంచాయతీ కార్యదర్శులు వడ్డీలకు అప్పులు తెచ్చి గ్రామ పంచాయతీలను నిర్వహించడం దురదృష్టకరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మహేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులు, పంచాయతీల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు తమ గోడును వెల్లబోసుకున్నారు. సంవత్సరకాలంగా రూ.30 వేల జీతంతో కాలం వెళ్లదీస్తున్నామని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు విడుదల కాకపోవడంతో అప్పులు చేస్తున్నామని వాపోయారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగలేదని, ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులను అప్పుల ఊబిలోకి నెడుతున్నారన్నారు. గతంలో మిషన్‌బగీరథ నీరు సాఫీగా సరపరా అయ్యేదని, ప్రస్తుతం తాగునీరు అందడం లేదన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో శైలజ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో సిబ్బంది కీలకం

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో సెర్ప్ అధికారులు, ఐకేపీ సిబ్బంది పాత్ర కీలకమని డీఆర్డీవో శ్రీలత అన్నారు. శుక్రవారం మండలంలోని పులిమామిడి గ్రామాన్ని సందర్శించారు. డ్వాక్రా మహిళలు, వన నర్సరీ, ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల యూనిఫాం కుట్టడానికి సెర్ప్ అధికారులు ఎదుర్కొన్న సమస్యలపై ఆరా తీశారు. యూనిఫాం కుట్టే సమయంలో విద్యార్థుల నుంచి కొలతలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి డీఆర్డీవో దృష్టికి తెచ్చారు. డ్వాక్రా మహిళలు పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు. వర్షాకాలం వచ్చే నాటికి వన నర్సరీలలో మొక్కలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఏపీఎం కవి, ఏపీవో ఎన్ను రవీందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్, టీఏ బొక్క బాల్‌రెడ్డి, ఐకేపీ సీసీలు, ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నిరంతర విద్యుత్

» ట్రాన్స్‌కో ఎస్ఈ లీలావతి

ధారూరు, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరంగా సరఫరా చేస్తున్నామని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలావతి అన్నారు. మండల పరిధిలోని కేరెల్లి గ్రామ పరిధిలో విద్యుత్ అధికారులతో కలిసి శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైతులతో మాట్లాడి విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ అంతరాయం రాకుండా ఇంటర్మీడియట్ పోల్స్, ఆన్ ఆఫ్ స్విచ్‌లు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొంత మంది రైతులు విద్యుత్ సమస్యలను ఎస్ఈ దృష్టికి తెచ్చారు. మున్నూర్ సోమారం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కేరెల్లికి విద్యుత్ సరఫరా చేయటం వల్ల తరుచూ అంతరాయం ఏర్పడుతుందని, ధారూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సరఫరా చేయాలని రైతులు కోరారు. విద్యుత్ అధికారులు సరిగా స్పందించటం లేదని ఫిర్యాదు చేశారు. ఎస్ఈ వెంట వికారాబాద్ ట్రాన్స్‌కో డీఈ సంజీవ్, ఏడీ సత్యనారాయణ ఉన్నారు.

శివ కలశం @ రూ.1.05 లక్షలు



కలశంతో ఊరేగింపుగా వెళ్తున్న ఆర్తితో ఆలయ నిర్వాహకులు

బషీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గణేశ్ లడ్డూ వేలం నిర్వహించడం చూశాం. కానీ, బషీరాబాద్ మండలం జీవన్గిలోని శ్రీమహాదేవలింగేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలందుకున్న శివ కలశాన్ని ఆలయ నిర్వాహకులు శుక్రవారం వేలం వేశారు. 38 ఏళ్లుగా ఈ సంప్రదాయిం కొనసాగుతోంది. కలశం పొందిన వారికి అన్నీ శుభాలే జరుగుతాయని భక్తుల నమ్మకం. ఈ సారి బషీరాబాద్‌కు చెందిన ఆర్తి(సెమెంట్ వ్యాపారి) వేలం పాటలో రూ.1,05,000కు కలశాన్ని సొంతం చేసుకుంది. ఆలయ చరిత్రలో ఇదే అత్యధిక పలికిన వేలం పాట. అనంతరం డప్పులు, వాయిద్యాల మధ్య శివ కలశాన్ని ఊరేగింపుతా ఆర్తి ఇంటికి తీసుకెళ్లారు. గతేడాది మెడ్చేల్‌కు చెందిన భీంరెడ్డి రూ.85,116కు కలశాన్ని దక్కించుకున్నారు.

వేసవిలో నీటికొరత లేకుండా చూడాలి

కోట్‌పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటికొరత లేకుండా చూడాలని డీపీవో జయసుధ అన్నారు. మండలంలోని బార్వాద్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పలు రికార్డులను పరిశీలించి ఇంటి పన్ను 100 శాతం పూర్తిచేయాలని సూచించారు. గ్రామంలోని శ్మశానవాటిక, కంపోస్టుషెడ్డు, పార్కు, నర్సరీలను పరిశీలించారు. వేసవి సమీపిస్తుండటంతో గ్రామంలో మిషన్ భగీరథ నీటికి ఆటంకం కలిగినప్పుడు నీటిఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలన్నారు. చేతిపంపులు, బోరు మోటార్లు సరిచేసుకోవాలని తెలిపారు. పంచాయతీలో ఇప్పటికే 65శాతం ఇంటి పన్ను వసూలు కాగా దానిని 100 శాతానికి పూర్తి చేయాలన్నారు. నర్సరీలో మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించకుండా ఏపుగా పెరిగేందుకు ఎప్పటికప్పుడు నీరుపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీవో అనంత రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి మసియోద్దీన్, తదితరులు ఉన్నారు.

కొత్త రేషన్‌కార్డులు వచ్చేశాయ్!

(ఐదో పేజీ తరువాయి)



కుటుంబాలకు రేషన్ కార్డులు ఇవ్వడం తోపాటు బియ్యం పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లాలో ఇదివరకు 2,41,179 రేషన్ కార్డులు ఉండగా, వాటిలో 2,14,484 ఆహార భద్రత, 26,659 అంత్యోదయ, 36 అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీంతో ప్రజాపాలన కార్యక్రమంతో పాటు ప్రజావాణి, సమగ్ర ఇంటింటి సర్వే ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. సంవత్సరాల తరబడి కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరగకపోవడంతో పేదలు గంపెడాశతో ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో రేషన్ కార్డు కీలకం కావడంతో దాని ప్రాధాన్యత పెరిగింది. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన ఉన్నతాధికారులు తొలి విడతలో వికారాబాద్ జిల్లాకు 22,404 రేషన్ కార్డులు మంజూరు చేశారు. కొత్తగా మంజూరైన రేషన్ కార్డులతో కలిపి వికారాబాద్ జిల్లాలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 2,63,583కు చేరింది.

రంగారెడ్డి జిల్లాలో 5,58,410 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో అంత్యోదయ 33481, ఆహార భద్రత 5,24,890, అన్నపూర్ణ 39 కార్డులు ఉన్నాయి. జిల్లాకు కొత్తగా 23,643 కార్డులు మంజూరయ్యాయి. పాతవి, కొత్తవి కలిపి మొత్తం కార్డుల సంఖ్య 5,82,053కు చేరుకుంది. కొత్త రేషన్ కార్డులకు మార్చి నెల నుంచే బియ్యం పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉంటే, అర్హులైన కుటుంబాలకు విడతల వారీగా రేషన్ కార్డులు మంజూరు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలనలో 1,21,016, గ్రామ సభలు, వార్డు సభల్లో 33,435 దరఖాస్తులు రేషన్ కార్డుల కోసం అందాయి. ఇందులో గ్రామ సభలు, వార్డుల్లో అందిన 33,435 దరఖాస్తులు వంద శాతం డాటా ఎంట్రీ పూర్తయ్యింది. జనవరి 26న నాలుగు పథకాల ప్రారంభోత్సవంలో ప్రభుత్వం జిల్లాలో కేవలం ఐదు గ్రామాల్లో 118 కార్డులను మాత్రమే అందించింది. ప్రభుత్వం నిర్వహించిన కుల గణన ద్వారా విచారణ చేపట్టిన అధికారులు 6700 మందికి నేటి నుంచి కొత్తగా రేషన్ కార్డులు అందించనున్నారు.

గ్రామాల వారీగా లబ్ధిదారులు

మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వం నేటి నుంచి 6,700 మందికి కొత్తగా రేషన్ కార్డులు అందజేయనుంది. అందులో కీసరలో 984, ఘట్‌కేసర్ మండలంలో 786, మేడిపల్లిలో 1071, మూడుచింతలపల్లిలో 253, శ్యాపాలో 1516, గండిమైసమ్మ(దుండిగల్)లో 573, బాచుపల్లిలో 203, శామీర్‌పేట 538 కార్డులు అందించనున్నారు. జిల్లాలో కీసర, మల్కాజిగిరి రెండు డివిజన్లలో సివిల్ సప్లయ్ శాఖలో బాలానగర్, ఉప్పల్ సర్కిల్స్ అర్బన్‌లో 6 మండలాలున్నాయి. వీటి పరిధిలో మొత్తం 619 రేషన్ దుకాణాలున్నాయి. జిల్లాలో ఇప్పటి వరకు 5,23,800 కార్డులుండగా కొత్తగా 6700 కార్డులు అందించనున్నారు.

రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి సేఫ్

» సమయానికి అధికారుల స్పందన



సర్వే నెంబర్ 53లో సర్వే చేస్తున్న సర్వేయర్ వెంకటేష్

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారులు సమయానికి స్పందించి రూ.2 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. వివరాలోకి వెళ్తే.. కేశంపేట మండల పరిధిలోని భైర్కాన్‌పల్లి గ్రామంలో సర్వే నంబర్ 53/1లో దాదాపు ఆరెకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని విలువ మార్కెట్లో దాదాపు రూ.5 కోట్లు విలువ ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ఈ భూమికి అనుకుని 53/15లో ప్రైవేట్ వ్యక్తులకు ఐదెకరాల పట్టా భూమి ఉంది. సదరు వ్యక్తి వెంకటపూరం లక్ష్మమ్మ తన భూమికి ఫెన్సింగ్ వేసే క్రమంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి హద్దు రాళ్లు పాతి, పెన్సింగ్ వేసింది. దీనిపై గ్రామ మాజీ సర్పంచ్ రూప్లానాయక్, అంజయ్య, యాదగిరి చారి తహసీల్దార్ అజాంఅలీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ శుక్రవారం సర్వేయర్ వెంకటేష్, ఆర్ఐ నివేదితను సర్వే చేయడానికి పంపించారు. సర్వే చేస్తున్న క్రమంలో పట్టాదారు లక్ష్మమ్మతోపాటు మరికొందరు అధికారులను అడ్డుకున్నారు. తాము కొనుగోలు చేసిన హద్దుల ప్రకారమే ఫెన్సింగ్స్ చేశామని తెలిపారు. అధికారులు వారికి నచ్చజెప్పి సర్వే చేశారు. 2.27 ఎకరాల ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ వేసినట్లు గుర్తించారు. ఈ విషయం పట్టాదార్లకు వివరించారు. వారు పాతిన ఫెన్సింగ్, హద్దురాళ్లను గ్రామస్తుల సమక్షంలో తొలిగించారు. ప్రభుత్వ భూమిని కాపాడిన అధికారులను గ్రామస్తులు అభినందించారు.

ఎమ్మెల్సీలుగా దివ్యాంగులకు అవకాశం కల్పించాలి

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీ కానున్న ఐదు ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాల్లో దివ్యాంగులకు కేటాయించాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో రాజ్యాధికారానికి దూరమై దుర్భర జీవితాలు గడుపుతున్న దివ్యాంగులకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పోతురాజు సుధీర్, మండల అధ్యక్షుడు చుక్కయ్య, పరిగి మండల అధ్యక్షుడు చంద్రయ్య, దోమ మండల మీడియా కన్వీనర్ మహేశ్, ప్రధాన కార్యదర్శి బోయిని వెంకటయ్య, భారతి జంగయ్య, పరిగి మండల ఉపాధ్యక్షుడు నారాయణ, కోళ్ల మంగమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై ఆరా..

» కరన్‌కోట్ నాపరాతి గనుల్లో అధికారుల తనిఖీ

తాండూరురూరల్, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరన్‌కోట్, ఓగీపూర్ నాపరాతి గనుల్లో అక్రమ తవ్వకాలపై రెవెన్యూ, మైన్స్, విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సర్వేనంబర్-2 ప్రభుత్వ భూమిలో రమేశ్ అనే వ్యక్తి అక్రమ తవ్వకాలపై ఆరా తీశారు. విచారణలో గుర్తించిన అధికారులు ఈ విద్యుత్ సరఫరా ఎక్కడి నుంచి వస్తుందనే విషయంపై ఆరా తీశారు. సమీపంలోని పురాన్ శర్మ అనే వ్యక్తి నాపరాతి గని నుంచి 103 సర్వీస్ కనెక్షన్ ద్వారా అక్రమంగా లైన్ తీసుకొన్నట్లు లైన్‌మెన్ గరివప్ప వివరించారు. అనంతరం ఆర్ఐ నిర్మల, టెక్నికల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, రెవెన్యూ ఆర్ఐ గోపి, సర్వేయర్ మహేష్‌ల బృందం అక్కడ తవ్వకాలపై టేప్‌తో మెజర్‌మెంట్స్ తీసుకున్నారు. సమీపంలోని సర్వే నంబర్-103లోని అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. సర్వేనంబర్-2లో మైన్స్ లీజు లేకుండానే ఎంత మంది తవ్వకాలు జరుపుతున్నారనే విషయంపై ఆరా తీశారు. సమీపంలోని మాను సర్వీస్ కనెక్షన్ నెంబర్-849, ఆరీఫ్ అనే వ్యక్తులు తవ్వకాలు జరుపుతున్నారని గుర్తించారు. వీరికి అనుమతులు ఉన్నాయా, ఎక్కడి నుంచి విద్యుత్ సరఫరా అవుతుందనే దానిపై విచారణ జరుపుతామని పేర్కొన్నారు. లీజులు లేకుండా అక్రమ తవ్వకాలు చేపడితే సీజ్ చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

చేవెళ్లలో జిల్లా అదనపు కోర్టు ప్రారంభం



అదనపు కోర్టును ప్రారంభిస్తున్న అదనపు జడ్జి ప్రదీప్‌నాయక్

చేవెళ్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన డిజిటలైజేషన్ సెంటర్‌తోపాటు విట్‌నెస్ డిపోజిషన్ సెంటర్‌ను హై కోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్‌పాల్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం రాజేంద్రనగర్, చేవెళ్ల కోర్టులను డిజిటల్ పద్ధతిలో ప్రారంభించారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు ప్రారంభమైంది. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సామ్‌కోసి, రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశీధర్‌రెడ్డి సమక్షంలో వర్చువల్‌గా జిల్లా అదనపు కోర్టును ప్రారంభించారు. చేవెళ్ల కోర్టు భవనంలో జిల్లా అదనపు జడ్జి ప్రదీప్‌నాయక్ సమక్షంలో న్యాయవాదులు, కోర్టు అధికారులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కోర్టు జడ్జి దశరథ రామయ్య, సీనియర్ న్యాయవాదులు రేసు మహేందర్‌రెడ్డి, రాంరెడ్డి, చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ప్రభుత్వ ప్లీడర్ బక్కరెడ్డి యాదిరెడ్డి, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు ఉన్నారు.



మంగల్‌పల్లి మహామ్మాయి ఆలయం సమీపంలో చెక్‌డ్యాంకు గండి

చెక్ డ్యామ్‌కు గండి.. నీరు వృథా

ఆదిభట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వానకాలంలో కురిసే నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచేందుకు ప్రభుత్వాలు ఈజీఎస్ పథకం కింద నిధులు కేటాయించి చెక్‌డ్యాంలు నిర్మించింది. ఆదిభట్ల మున్సిపల్ పరిధిలో ప్రవహించే పులందరి వాగుపై మంగల్‌పల్లి(మహామ్మాయి దేవాలయం)సమీపంలో చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండడంతో మత్స్యకారులు చేపల పెంపకం చేపట్టారు. అయితే ఆదిభట్ల మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి చెందుతుండడంలో కాలనీలు పెరిగాయి. ఆయా కాలనీల నుంచి వెలువడుతున్న డ్రైనేజీ నీరు పులందరి వాగులో కలవడంతో మంగల్‌పల్లి, శేరిగూడ సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాంలోకి మురుగు నీరు వచ్చి చేరుతుంది. మంగల్‌పల్లి మహామ్మాయి గుడి దగ్గర వరకు ఆ నీరు చేరడంతో అక్కడ ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం మురుగు నీటిలో మునిగిపోతుంది. దీంతో ఆలయ కమిటీ వాళ్లు చెక్‌డ్యాంకు గండికొట్టినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు పులందరి వాగులో డ్రైనేజీ నీరు కలవనీయకుండా చర్యలు చేపట్టి చెక్‌డ్యాంకు మరమ్మతులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఎర్రమట్టి తవ్వకాలను అడ్డుకున్న భక్తులు

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేస్తుండడంతో భక్తులు అడ్డుకున్నారు. మహాశివరాత్రి సందర్భంగా వికారాబాద్ మండలం పులుసుమామిడి గ్రామంలో పరమేశ్వర దేవాలయ చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేపట్టగా కొందరు జేసీబీలు పెట్టి పరమేశ్వరుడి గుట్టను తవ్వుతుండగా భక్తులు అడ్డుకున్నారు. జేసీబీని చుట్టుముట్టి ప్రశ్నించారు. గత కొన్ని నెలలుగా ఈ అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పగలూరాత్రి తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు మండల పరిధిలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కొందరూ అధికారులు లంచాలకు అలవాటు పడి ఎర్రమట్టి లారీలు పట్టుకుని విడిచి పెడుతున్నారని, అధికారులు పూర్తిగా సీజ్ చేసినట్లైతేనే ఈ ఎర్రమట్టి దందా ఆగుతుందని స్పష్టం చేశారు.

పత్తిసాగుకు తేలికపాటి నేలలు అనుకూలం

పరిగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పత్తిసాగుకు తేలికపాటి నేలలు అధిక సాంద్రత పత్తి సాగుకు అనుకూలమని వ్యవసాయ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సి.సుధారాణి అన్నారు. ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం పరిగి మండలంలోని సయ్యద్‌పల్లిలోని రైతువేదికలో పత్తిసాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ యమున, టి.రాజేశ్వర్, టి.లక్ష్మణ్, వైజయంతి పాల్గొన్నారు.

మాయాజలం!

(5వ పేజీ తరువాయి)

ఫిల్టర్ చేసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 100కు పైగా అనుమతులు లేని నీటి శుద్ధి కేంద్రాలు కొనసాగుతున్నట్లు సమాచారం. కొత్తగా మరికొన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయటానికి పలువురు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు.

సామర్థ్యానికి మించి ఫిల్టర్

కొందరు నీటి శుద్ధి కేంద్రాల నిర్వాహకులు ప్లాంట్ సామర్థ్యానికి మించి నీటిని శుద్ధి చేసి మినరల్ వాటర్‌గా అమ్మేస్తున్నారు. నీటి శుద్ధికి ప్లాంట్లలో ఉపయోగించే విజిల్స్‌లో కార్బన్, ఇసుక ఇతర ఫిల్టర్లను సమయానికి మార్చటం లేదు. నీటి లవణాలను పరీక్షించే టీడీఎస్ నిబంధనలను నిర్వాహకులు పట్టించుకోవటం లేదు. ప్లాంట్‌లో శుద్ధి చేసిన నీటిని టీడీఎస్ పరీక్షలు నిర్వహిస్తే అందులో మేలురకం నీటి లవణాలు కనీసం 300-500వరకు ఉండాలి. స్థానిక ప్లాంట్లలో శుద్ధి చేసిన నీటిలో 500 నుంచి 1200 వరకు లవణాలు ఉంటున్నట్లు ఆరోపణలున్నాయి.

నిబంధనలు ఇలా..

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభించే వారు ముందుగా స్థానిక మున్సిపల్, లేదా పంచాయతీ అనుమతి పొందాలి. వాటర్ ప్లాంట్‌ను ఇళ్లలో కాకుండా కనీసం 300 చదరపు గజాల ప్రత్యేకమైన షెడ్‌లో ఏర్పాటు చేయాలి. బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్)వారి అనుమతి పొందాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ(ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా), ఐఎస్ఓ గుర్తింపు పొందాలి. నీటి శుద్ధి కేంద్రానికి ప్రత్యేకంగా బోరు ఏర్పాటు చేసుకోవటంతోపాటు ప్లాంట్ నిర్వాహణకు కమర్షియల్ కరెంట్ మీటర్ వాడాలి.

ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు

సరిగా శుద్ధి కాని నీటిని తాగుతున్న ప్రజలు ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా మూత్ర పిండాలు, జాండీస్ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీనికి తోడు జీర్ణ శక్తి నశించటం, కీళ్ల నొప్పులు, గ్యాస్ ట్రబుల్, వృద్ధాప్య లక్షణాలు, కొలెస్ట్రాల్, బరువు పెరిగే సమస్యలు ఉత్పన్నమవుతాయి.

రిజిస్ట్రేషన్ ఆదాయంలో వికారాబాద్ టాప్

- గతేడాది కంటే పెరిగిన ఆన్‌కమ్
- జిల్లాలో ప్రక్రియ వేగవంతం చేసేందుకే ప్రీ రిజిస్ట్రేషన్ సదుపాయం
- స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్ల జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ కుమార్



వికారాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ సంతోష్ కుమార్

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రిజిస్ట్రేషన్ ఫీజుల రూపంలో సమకూరే ఆదాయంలో వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందంజలో ఉందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల రిజిస్ట్రార్ సంతోష్‌కుమార్ తెలిపారు. వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జిల్లాలో వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా, ఆదాయం వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మిగతా కార్యాలయాల కంటే ముందున్నదని చెప్పారు. గతేడాది వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.24కోట్ల ఆదాయం సమకూరితే, ఈఏడాది ఇప్పటి వరకు రూ.24.97కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. గతేడాది పరిగి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రూ.6.61కోట్ల ఆదాయం రాగా, ఈ సంవత్సరం రూ.6.34కోట్లు వచ్చాయన్నారు. అదే తాండూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి గతేడాది రూ.8.06కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.9.05కోట్ల ఆదాయం సమకూరిందని చెప్పారు. గతేడాది కొడంగల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.1.50కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.2.13కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఇదిలా ఉంటే, ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతమయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రీ రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని అమల్లోకి తీసుకు వచ్చిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన వారు నేరుగా వెబ్‌సైట్‌లో సంబంధిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేసి నిర్ణీతఫీజు చెల్లింపులు చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి సంప్రదిస్తే నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుందని చెప్పారు. ఎల్ఆర్ఎస్ కోసం చెల్లించాల్సిన ఫీజులో 25శాతం రాయితీ ఇవ్వనున్నారని, మార్చి 21 వరకు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు ఎదురైనా.. నిలిచిపోయినా చెల్లించిన ఫీజులో 10శాతం మినహాయించి మిగతా 90శాతం తిరిగి చెల్లించబడుతుందన్నారు. ప్రీరిజిస్ట్రేషన్‌పై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ మహేందర్ తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్ఎస్ అమలుపై మంగళవారం ఉన్నతాధికారులపై జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 5 నుంచి 25వ తేదీ వరకు జరిగే పరీక్షలను ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్స్ వాచ్, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించకూడదని సూచించారు. ఈ సమావేశంలో ఎస్పీ నారాయణ రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం. శంకర్ నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, వైద్య, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ.. తండ్రీకొడుకు మృతి



ప్రమాద స్థలంలో గోపయ్య



నర్సింహులు(ఫైల్)

తాండూరు రూరల్, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): లారీని అతివేగం, అజాగ్రత్తగా నడిపి స్కూటీని ఢీకొట్టిన ప్రమాదంలో తండ్రీకొడుకు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన మండలంలోని చెంగోల్ సమీపంలోని బైపాస్ రోడ్డులో చోటుచేసుకుంది. స్థానికులు, కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెంగోల్ గ్రామానికి చెందిన ఈడ్గి నర్సింహులు(35) కిరాణా దుకాణాన్ని కొనసాగిస్తున్నాడు. తండ్రి గోపయ్య అనారోగ్యానికి గురికావడంతో స్కూటీపై వచ్చి తాండూరులోని ఆస్పత్రిలో చూపించుకుని గ్రామానికి బయల్దేరారు. ఈ క్రమంలో చెంగోల్ సమీపంలోని బైపాస్ రోడ్డు సమీపంలో లారీ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సింహులు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి గోపయ్యకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108, పోలీసులకు సమాచారం ఇచ్చి గోపయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గోపయ్య చికిత్స పొందుతూ మృతిచెందాడు. నర్సింహులుకు భార్య నర్మద, ఇద్దరు కుమారులున్నారు. తండ్రీ కొడుకుల మృతితో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

బైక్ ఢీకొని హోంగార్డుకు గాయాలు

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులను తప్పించబోయి ముందు ఉన్న హోంగార్డును బైక్ ఢీకొన్న ప్రమాదంలో హోంగార్డుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ధన్నారంకు వెళ్లే మార్గంలో రైల్వే క్వార్టర్స్ సమీపంలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇదే సమయంలో శ్రీరాంనగర్ తండాకు చెందిన లాల్ సింగ్ అనే వ్యక్తి మద్యం మత్తులో వేగంగా వచ్చి ట్రాఫిక్ పోలీసులను తప్పించుకుని ముందుకెళ్లాడు. కొద్ది దూరంలో ఉన్న హోంగార్డు కృష్ణ ఆపే ప్రయత్నం చేయగా కృష్ణను వేగంగా ఢీకొట్టడంతో కృష్ణాతో పాటు లాల్‌సింగ్ కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో కృష్ణ తల, కాళ్లకు గాయాలు కాగా లాల్‌సింగ్‌కు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

శాస్త్రసాంకేతిక రంగాల్లో ముందడుగు వేయాలి



పెద్దేముల్: సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పెద్దేముల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాల్యం నుంచే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందడుగు వేయాలని ఎంపీడీవో జర్నప్ప అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఎంపీడీవో జర్నప్ప ప్రారంభించి విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా జీవశాస్త్ర ఉపాధ్యాయులు శంకర్, నజీర్ అహ్మద్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు రామలింగేశ్వరరావు, రవికుమార్‌లను పాఠశాల తరపున ఆత్మీయంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సునీత, ఉపాధ్యాయులు నరేందర్‌రెడ్డి, సంధ్యారాణి, శ్రీధర్, రవికుమార్, యాదగిరి, మధుసూదన్, జయశ్రీ, శిరీషాదేవి పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: మానవళి అభివృద్ధికి సైన్స్ ఎంతగానో దోహదపడుతుందని రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ పి.రాఘవేందర్‌యాదవ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు వివిధ ప్రయోగాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు హైమద్, పార్వతి, కవిత, స్వరూప, సమ్రీన్, యాదమ్మ, సన, నవనీత, అపర్ణ, శ్రీలత, అర్చన తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా వివిధ రకాల ప్రయోగాలను తయారు చేసి ప్రదర్శించారు. ఎంఈవో విజయరామారావు మాట్లాడుతూ.. విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, రమేశ్‌యాదవ్, ముకుందరెడ్డి పాల్గొన్నారు.

తాండూరు: తాండూరు శ్రీచైతన్య హైస్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభను చాటారు. పాఠశాల ఆవరణలో శుక్రవారం 8, 9, 10 తరగతి విద్యార్థులు తాము చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన పరికరాలను ప్రదర్శించారు. స్థానిక శ్రీ కృష్ణవేణి పాఠశాలలో జరిగిన కార్యక్రమాన్ని ఎంఈవో హబీబ్ అహ్మద్ పరిశీలించారు. అదే విధంగా కేజీబీవీ, ముజాహిద్‌పూర్ పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు.

కొడంగల్:పట్టణంలోని నవీన ఆదర్శ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలను ప్రదర్శించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు డి.వెంకటయ్య, ప్రిన్సిపాల్ డీవీ.నరేశ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రతినిధి: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లోపి రాక్‌ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జాతీయ విజ్ఞాన దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ కె ఫణీంద్ర విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. అదేవిధంగా నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పాల్గొని విద్యార్థులు తయారు చేసిన 50 నమూనా ప్రయోగాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాములు, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకోవాలి



ఎంఈవో వసంతకుమారిని సన్మానిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను సమాజంలోని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హితవు చెప్పారు. శామీర్‌పేట ఎంఈవో వసంతకుమారి శుక్రవారం ఉద్యోగ రమణ పొందారు. ఈ సందర్భంగా శుక్రవారం శామీర్‌పేట మండలం తూంకుంటలోని మొగుళ్ల వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ విరమణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటల రాజేందర్, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, మండలంలోని జడ్పీ పాఠశాలల హెచ్ఎంలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు విచ్చేసి ఎంఈవో వసంతకుమారికి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్.. మాట్లాడుతూ వసంతకుమారి శామీర్‌పేట మండలంలో 36ఏళ్ల పాటు ప్రధానోపాధ్యాయురాలిగా, ఎంఈవోగా ఉత్తమ సేవలందించి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలుగా అవార్డును పొందడం గర్వకారణమన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం

పరిగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని పరిగి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ అన్నారు. పరిగి డిపోలో ఏడీసీలుగా పని చేస్తున్న కె.కృష్ణారెడ్డి, షబ్బీర్‌లు శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డిపో వారికి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సోంమ్లా, మల్లయ్యయాదవ్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొనేందుకు విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మైక్రోసాఫ్ట్ టెక్నికల్ కన్సల్టెంట్ అపూర్వజైన్ తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన బూట్‌క్యాంప్‌లో భాగంగా 30గంటల హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీన్లు విజయకుమార్, విష్ణుమూర్తి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఒక లక్ష్యంతో మందుకు సాగాలని ప్రముఖ వ్యాపారవేత్త సృజన్ సింహ మెరుగు అన్నారు. పట్టణంలోని స్ఫూర్తి జూనియర్ కళాశాల శుక్రవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం సభ్యులు మంజుల ప్రకాష్, కములాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అవుశాపూర్‌లో అఖండజ్యోతికి బ్రహ్మరథం

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): యాదాద్రి శ్రీ లక్ష్మినర్సింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బర్కత్‌పుర యాదగిరి భవన్ నుంచి యాదాద్రికి బయల్దేరిన శ్రీ లక్ష్మినర్సింహ్మస్వామి అఖండజ్యోతి రథం శుక్రవారం ఉదయం అవుషాపూర్‌కు చేరుకుంది. అఖండజ్యోతి రథానికి భక్తులు పెద్దసంఖ్యలో పెద్దసంఖ్యలో స్వాగతం పలికి పత్యేకపూజలు నిర్వహించారు. అఖండరథం శనివారం(నేడు) యాదాద్రికి చేరుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఏనుగు లక్ష్మారెడ్డి, జిల్లాల మధుసుదన్‌రెడ్డి, ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొదుపుపై విద్యార్థులు దృష్టి సారించాలి

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చిన్నమొత్తాల పొదుపుపై విద్యార్థులు దృష్టి సారించాలని మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్ అన్నారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా శుక్రవారం కీసరలోని మహత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలలో ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. చిన్న మొత్తాల పొదుపు భవిష్యత్ అవసరాలు తీర్చడానికి ఉపయోగపడతాయన్నారు. విద్యార్థి దశ నుంచే ఆర్థిక ప్రణాళికలు రూపొందించి, దేశ ఆర్థిక అభివృద్ధికి మహిళలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళల ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎల్లబోయిన విశ్వనాథ్, ఉమామహేశ్వరి, గంగావతి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

'యుద్ధభేరి'ని విజయవంతం చేయాలి

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతను విచ్ఛిన్నం చేసే ఏకీకృత విధానాన్ని వ్యతిరేకిస్తూ తలపెట్టిన యుద్ధభేరి సదస్సుకు తరలి రావాలని ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. పట్టణంలోని శివారెడ్డిపేట, ఆలంపల్లి పాఠశాలలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు పట్నం రాఘవేందర్, రాష్ట్ర సాహిత్య సభ్యుడు మురహరినాథ్‌లు శుక్రవారం ఉపాధ్యాయులతో కలిసి యుద్ధభేరి ధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో దేవ్యా, జహంగీర్, విష్ణువర్ధన్, రజిత పాల్గొన్నారు.

కులకచర్ల: మార్చి 2న నిర్వహించే యుద్ధభేరి సదస్సు పోస్టర్‌ను శుక్రవారం ముజాహిద్‌పూర్ జడ్పీహెచ్ఎస్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్, పీఆర్‌టీయూ, టీపీయూఎస్, టీపీఆర్‌టీయూ, టీజీయూఎస్ సంఘాల నాయకులు వెంకటయ్య, ఎల్లయ్య, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కళాశాలలో రక్తదాన శిబిరం

మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని పెద్దఎత్తున రక్తదానం చేశారు. ఎన్ఎస్ఎస్ క్లబ్, మహావీర్ ఇంటర్నేషనల్ అండ్ తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తదానం చేసి విద్యార్థులకు గుర్తింపు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి టీ.వీ.రెడ్డి, డైరెక్టర్ కె.శ్రీలత పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

కులకచర్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని కుసుమ సముద్రం గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులకు డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాంచంద్రయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కరన్‌కోట్ పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరంలో నాయకులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెల్కటూర్ గ్రామ శివారులోని అదాని సిమెంట్స్ ఆధ్వర్యంలో శుక్రవారం కరన్‌కోట్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీ శరణు బసప్ప, మాజీ ఎంపీటీసీలు రాజ్‌కుమార్, శివకుమార్‌లు పాల్గొన్నారు. అదానీ గ్రూప్స్ సీఎస్ఆర్ నాగార్జున ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి వైద్యులు 130మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో కొంతమందికి జనరల్ చెకప్, షుగర్, బీపీ వంటి వైద్య పరీక్షలు చేశారు. పేయిన్ కిల్లర్ వంటి మందులు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. అదానీ సిమెంట్స్ వారు కరన్‌కోట్ గ్రామంలో సామాజిక సేవలు అందించడం అభినందనీయమన్నారు. గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూనిఫాంలు, బ్యాగులు అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అదానీగ్రూప్ ప్రతినిధులు విజయ్‌కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

తాండూరు రూరల్/దౌల్తాబాద్/ మోమిన్‌పేట్/ పూడూరు/మర్పల్లి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఎవరూ పౌరహక్కులకు భంగం కలిగించరాదని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ అన్నారు. మండలంలోని ఎల్మకన్నె గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా దౌల్తాబాద్ మండలంలోని దేవరఫస్లాబాద్‌లో ఎస్ఐ రవిగౌడ్ పౌర హక్కుల దినోత్సవంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మోమిన్‌పేట్ మండలంలోని గోవిందాపూర్‌లో ఆర్ఐ గోవర్ధన్ పౌరుల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ జైపాల్ రెడ్డి, ఏఎస్ఐ దత్తాత్రి, పంచాయతీ కార్యదర్శి జగన్నాథ్‌రెడ్డి కానిస్టేబుల్ మాధవి, గ్రామస్తులు పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరు మండలంలోని గొంగుపల్లి గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, అధికారులు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. మర్పల్లి మండలంలోని కోట మర్పల్లి గ్రామంలో తహసీల్దార్ మునిరోద్దీన్ సిరిపూరం ఎస్సీ హాస్టల్ వార్డెన్ తుల్జారాంగౌడ్ అధ్యక్షత పౌర హక్కుల దినోత్సవంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఆర్ఐ మాధవరెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3.20లక్షల విరాళం

పరిగి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సీసీకెమెరాల ఏర్పాటుకు దాతల సహకారం అభినందనీయమని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అప్రైజర్స్ గ్లోరీ సంస్థ ప్రతినిధులు అఫ్జన్‌సలాం, కలీం బాబులు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3.20 లక్షల విలువ గల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిగి వైస్ఎంపీపీ కావలి సత్యనారాయణ, ఎస్ఐ సంతోష్‌లు ఉన్నారు.

అంబేడ్కర్ కాస్య విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కాస్య విగ్రహ ఏర్పాటుకు వికారాబాద్ ఎన్నెపల్లి చౌరస్తాలో నాయకులు శుక్రవారం భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రదీప్‌పటేల్, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు సంతోషరాజుతో పాటు నియోజకవర్గంలోని ఆయాపార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

పోలెపల్లి ఎల్లమ్మ ఆలయానికి తగ్గని భక్తుల తాకిడి



ఎల్లమ్మను దర్శించుకుంటున్న భక్తులు

దుద్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి ఎల్లమ్మ ఆలయానికి భక్తుల తాకిడి తగ్గలేదు. ఈనెల 20 నుంచి 5 రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భక్తులు వేలాదిగా తరలి వచ్చి దర్శించుకున్నారు. శుక్రవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దోమ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో గ్యామా అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. అదే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బొంపల్లి పోస్టాఫీస్, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఎంపీడీవో పరిశీలించారు. పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. పోస్ట్‌మెన్‌లు పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు.

మత్తు పదార్థాలు వాడితే తీవ్ర పర్యవసానాలు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 28, (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలు వాడితే తీవ్ర పర్యవసానాలు ఎదురవుతాయని తాండూరు ఎక్సైజ్ సీఐ గంగాధర్ అన్నారు. మండలంలోని చెంగోల్ హైస్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం గంజాయి, మత్తు పదార్థాల వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నిజాముద్దీన్, సిబ్బంది భీమయ్య, రమేష్, మహేష్, కిశోర్, సతీష్, హెచ్ఎం నర్శునాయక్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడికి సన్మానం

బొంరాస్‌పేట్: అంబేడ్కర్ సంఘం కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. మండలంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, యేసప్ప, శ్యామ్, వెంకటయ్య, రత్నం, బైండ్ల రమేశ్, వెంకట్, వేణుగోపాల్ తదితరులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. అంబేడ్కర్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని అంబేడ్కర్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కొడంగల్: మండలంలోని ఇందనూర్ గ్రామంలో గత నెల 19న ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలైన కర్ని కృష్ణ, పెద్దింటి కృష్ణ, కిష్టప్ప, అంజిలప్ప కుటుంబాలను అంబేడ్కర్ ప్రజా సంఘాల నియోజకవర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు పరామర్శించారు. గ్రామానికి వెళ్లి శుక్రవారం కుటుంబాలతో మాట్లాడారు. చిన్నఘర్షణకే జైలు శిక్ష విధించడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కె.దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కోట్‌పల్లి: చెట్ల నరికివేత కారణంగా బార్వాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శనివారం (నేడు) విద్యుత్ అంతరాయం కలుగుతుందని కోట్‌పల్లి విద్యుత్ ఏఈ ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని బార్వాద్, మోత్కుపల్లి, కరీంపూర్, నాసన్‌పల్లి, బీరోల్ గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

యాడీబాపూఘడ్ పుణ్యక్షేత్రంగా మారుతుంది

పెద్దేముల్: యాడీబాపుఘడ్ రాబోవు రోజుల్లో ఒక పుణ్యక్షేత్రంగా మారుతుందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్ తెలిపారు. మండలంలోని కందనెల్లితండా సమీపంలోని యాడీబాపుఘడ్ దేవస్థానంలో ఆయన మంచినీటి సౌకర్యం కోసం తనసొంత నిధుల నుంచి సుమారు రూ.లక్షా 14వేలతో బోరువేయించి మంచినీటి సౌకర్యం కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో యాడీబాపుఘడ్ దేవస్థానం ఫౌండర్లు రమావత్ సురేందర్ నాయక్, శాంతిదేవి తదితరులు పాల్గొన్నారు.